క్లుప్తంగా

వసతుల కల్పనపై అవగాహన కల్పించాలి



వీపనగండ్ల: ప్రభుత్వ ఆస్పత్రులలో అందుతున్న వైద్య వసతులపై గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు అవగాహన కల్పించాలని వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో చిన్నంబావి, వీపనగండ్ల మండలాల ఆశావర్కర్లకు వైద్య వసతులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఉన్న మహిళలు అనారోగ్యానికి గురి కాకుండా అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన ఆశావర్కర్లను కోరారు.

కల్యాణ మండపం నిర్మాణానికి సహకారం



పాన్‌గల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయ నిర్మాణంలో భాగంగా మండలంలోని కొత్తపేటకు చెందిన కాంట్రాక్టర్ మోడల తిరుపతయ్యసాగర్ వారి కుమారుడు భానుప్రకాష్ జ్ఞాపకార్థం ఆలయ ఆవరణలో కల్యాణ మండపం నిర్మించేందుకు ముందుకు వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం పేర్కొన్నారు. దాదాపుగా రూ.20 లక్షలు ఖర్చుతో కల్యాణ మండపం నిర్మాణానికి ముందుకు వచ్చిన దాతను ఆలయ కమిటీ సభ్యులు అభినందిస్తూ.. ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'ఉపాధి' పనులకు భారీగా తరలిన కూలీలు



పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని కల్పిస్తామని చెప్పడం, పనులకు రావాలని గ్రామాల్లో అవగాహన కల్పిస్తుండడంతో బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండా నుంచి ఉపాధి పనులకు భారీగా కూలీలు తరలివెళ్లారు. ఎండల తీవ్రతతో పనులకు త్వరగా వెళ్లి మధ్యాహ్నం 12 గంటల లోపు ముగించాలని గ్రామాల్లో ఉపాధి సిబ్బంది అవగాహన కల్పిస్తుండటంతో దానికి అనుగుణంగానే కూలీలు పనులకు వెళ్తున్నారు.

వీవీఎం చారికి ఘన నివాళి



వనపర్తి టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న వీవీఎం చారి బుధవారం మరణించారు. ఈ మేరకు డిపో ఎదుట వీవీఎం చారి చిత్రపటానికి డిపో మేనేజర్ పరమేశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్చి 25వ తేదీన కొత్తూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ చనిపోయినట్లు తెలిపారు. వీవీఎం చారి డ్యూటీలో అంకిత భావంతో పనిచేసేవాడని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందినట్లు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు కొద్దిసేపు మౌనం పాటించారు.

పంచాయతీ కార్మికుడి మృతి


ఆనంద్ (ఫైల్)

పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లిలో అనారోగ్యంతో పంచాయతీ కార్మికుడు ఆనంద్(42) బుధవారం మృత్యువాత పడ్డారు. గ్రామ పంచాయతీలో వాటర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృత్యువాత పడినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పేర్కొన్నారు. అతడి మృతిపై పంచాయతీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మహిళపై దాడి: కేసు నమోదు

గోపాల్‌పేట: వదినపై మరిది దాడి చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని గోపాల్‌పేట ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పొలికెపాడుకు చెందిన శాంతమ్మ భర్త పోషన్న కొన్నేళ్ల క్రితం మరణించాడు. వారికి ఉన్న సుమారు 14 ఎకరాల పొలం పంపకాల విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో ఈనెల 3న సోమవారం రాత్రి తన మరిది శ్రీను శాంతమ్మపై దాడి చేశాడని తెలిపారు. దీంతో ఆమె గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. బుధవారం శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


ఎస్పీ కార్యాలయంలో..


తాడిపర్తిలో..


పాన్‌గల్ ఎంపీడీఓ కార్యాలయంలో..

జగ్జీవన్‌రాం సేవలు మరువలేనివి

వనపర్తి క్రైం: బాబు జగ్జీవన్‌రాం ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ షాకీర్‌హుస్సేన్ అన్నారు. జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీజేపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, సబ్బిరెడ్డి, కృష్ణ, జింకల కృష్ణ, రామన్‌గౌడ్, ఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి, సీతారాములు, బచ్చురాం, అనుజ్ఞారెడ్డి, పెద్దిరాజు, ప్రవీన్ ఉన్నారు.

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా టీజేఏసీ, టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో గర్భిణులకు, తల్లులకు పండ్లను చిన్నబాలయ్య అభిమానుల కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చీర్ల సత్యం, అక్తర్, కోట్ల రవి, సమద్, పలుస శంకర్‌గౌడ్, కవి జనజ్వాల, రాజారామ్‌ప్రకాశ్, కవి గిరిరాజాచారి, డప్పు నాగరాజు, రవిప్రసాద్‌గౌడ్, కృష్ణయ్య, జ్యోతి పాల్గొన్నారు.

కొత్తకోట: స్వర్గీయ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఆయన విగ్రహానికి జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పోగాకు విశ్వేశ్వర్, సీడీసీ చైర్మన్ భీసం చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుకేశిని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిబ్బంది నివాళులర్పించారు. కార్యక్రమంలో సుభాష్, ఖాజామైనోద్దీన్, రవీందర్‌రెడ్డి, అయ్యన్న, ప్రశాంత్, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: అమరచింత మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి,


ఆత్మకూర్‌లో జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్లు మహమ్మద్ ఖాజా, రమేష్ జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్‌ఎస్, కేవీపీఎస్, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో ఉమ్మడి మండలాల్లో జగ్జీవన్ రామ్ జయంతిని జరుపుకొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌ఏ రాజు, రమేష్, నరసింహులుగౌడ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తిలో బుధవారం బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసియాన్ వేదిక్ కల్చరల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన డప్పుస్వామిని, తెలుగు వెలుగు సాహితీ వేదుక నుంచి మహానంది పురస్కారం పొందిన సువర్ణను సన్మానించారు. కార్యక్రమంలో శాంతన్న, కురుమూర్తి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి తహసీల్దార్ అబ్రహం లింకన్‌తో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మదనాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేందర్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ అశోక్, కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో జగ్జీవన్‌రాం విగ్రహానికి సర్పంచ్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేశ్‌గౌడ్, వార్డు సభ్యుడు నారాయణరెడ్డి, సీఆర్పీ వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, కమల, ఆశావర్కర్లు రాధ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణంలో సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కృష్ణయ్యగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విజయ్‌కుమార్, జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు భూమయ్య, పల్లాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.


కొత్తకోటలో..


వనపర్తిలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో..


బీజేపీ జిల్లా కార్యాలయంలో..

కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం

అమరచింత: ఏప్రిల్ 6 నుంచి పల్లెపల్లెకు, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ బోసుపల్లి ప్రతాప్ తెలిపారు. ఆత్మకూర్ పట్టణంలో బుధవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6 నుంచి 12 వరకు రాష్ట్ర ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తెలియపరుస్తూ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం నిధులను వినియోగించుకుంటూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. దేశం కోసం అకుంఠిత దీక్షతో పనిచేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని మరోమారు బలపర్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కాటముని కృష్ణగౌడ్, శివశంకర్, వరప్రసాద్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు తంబలి విజయ్, సూరి, చందు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

'ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకే బీజేపీ కుట్రలు'

కొల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన కొల్లాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బండి సంజయ్ నీచ రాజకీయాలు చేస్తున్నారని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలో బీజేపీ హస్తం ఉందన్నారు. అడ్డగోలుగా పేపర్ లీకేజీలకు పాల్పడి ఆ నెపాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నెట్టేందుకు బీజేపీ ప్రయత్నించిందన్నారు. ఆయన్ను ఎంపీ పదవి నుంచి డిస్‌క్వాలిఫై చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ స్పీకర్ ఈ అంశంపై స్పందించాలన్నారు. బీజేపీ నాయకుల ఎత్తుగడలు, జిమ్మిక్కులను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. న్యాయం కోసం, ధర్మం కోసం తెలంగాణ ప్రజలు కేసీఆర్ వెంటే ఉంటారన్నారు. కమలేశ్వర్‌రావు, గణేష్‌రావు, జగన్మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరమనాయుని చెరువుకు కేఎల్ఐ నీరు

కొల్లాపూర్: ఎన్మన్‌బెట్లలోని వీరమనాయుని చెరువుకు కేఎల్ఐ నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెరువు కింద 4 వేల ఎకరాలకుపైగా ఆయకట్టు భూములు ఉన్నాయని, చెరువులో నీళ్ల అయిపోతే పంటలు ఎండిపోయే పరిస్థితులు ఉంటాయన్నారు. గత పాలకులు కేఎల్ఐ కాల్వలు తవ్వించినప్పుడే వీరమనాయుని చెరువుకు కూడా నీళ్లు మళ్లించేలా డిజైన్లు చేయించి ఉంటే బాగుండేదన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లానని, చెరువుకు కేఎల్ఐ నీళ్ల మళ్లించేందుకు అవసరమై చర్యలు చేపట్టాలని సీఎం నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఎమ్మెల్యే వివరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

మండలంలోని చింతలపల్లికి చెందిన జె.కృష్ణయ్యకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బుధవారం లబ్ధిదారుడికి ఎమ్మెల్యే అందజేశారు.



బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

కొత్తకోట: నియంత పోకడలు పోతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని బీజేపీ నాయకులు తెలిపారు. బీజేపీ కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో వారు స్టేషన్‌లోనే నిరసన వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకు ముందు ప్రధాన చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కొమ్ము భరత్‌భూషణ్, అమరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అమరచింత: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ, బీజేవైఎం నాయకులు అన్నారు. బండి సంజయ్‌ను పోలీసులు రాత్రికి రాత్రే అక్రమంగా అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ అమరచింత, ఆత్మకూర్ మండల కేంద్రాల్లో బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, ఆత్మకూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, క్యామ భాస్కర్, అనిల్ కుమార్, శ్రీనివాస్ యాదవ్, మాసన్న, కృష్ణమూర్తి, సురేష్, శివశంకర్, పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పాన్‌గల్: బండి సంజయ్ అరెస్టు నేపథ్యంలో బీజేపీ నాయకులు నిరసన తెలుపుతారనే ఉద్దేశ్యంతో వారిని బుధవారం ముందస్తుగానే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మండల బీజేపీ అధ్యక్షుడు అన్వేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, వెంకటేష్‌యాదవ్, తిరుపతయ్య, లక్ష్మణ్, రామకృష్ణ, వెంకట్‌సాగర్ తదితరులు ఉన్నారు.


శ్రీరంగాపురం పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన బీజేపీ నాయకులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బుధవారం మండల బీజేపి నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి, సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు ఎస్‌ఐ కేటీ మల్లేష్ తెలిపారు.

వీపనగండ్ల: మండలంలో బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మండలంలో ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని, నిబంధనలు ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామన్‌గౌడ్, ఏఎస్‌ఐ చంద్రారెడ్డి తెలిపారు.

ఖిల్లాఘనపురం: బండి సంజయ్ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్నారని బీజేపి జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపినాయక్‌తో పాటు మండల ప్రధాన కార్యదర్శులు అంజనేయులు ముదిరాజ్, శివశంకర్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆశన్న, అశోక్, బండరి రాజు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై వదిలేశారు.


అమరచింతలో బీజేపీ నాయకుల నిరసన

నాణ్యతలో మేలైనది భారతి సిమెంట్

చిన్నంబావి: నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంట్ పెట్టింది పేరని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ శ్రీధర్ అన్నారు. చిన్నంబావిలో బుధవారం అన్వేష్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో మేస్త్రీల సమావేశంలో భారతి సిమెంట్ సాంకేతిక ప్రమాణాలను వివరించారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్‌తో నిర్మాణం వేగంగా పూర్తవుతుందన్నారు. వినియోగదారులకు స్లాబ్, కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని చెప్పారు. అనంతరం 50 మంది మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. భారతీ సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని, యాదాద్రి నిర్మాణానికి, ఆలేరు వరంగల్ జాతీయ రహదారి, బాలానగర్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి భారతి సిమెంట్ వాడడం చాలా గర్వకారణమన్నారు. కార్యక్రమానికి సేల్స్ ఆఫీసర్ విజయబాబు, డీలర్ అన్వేష్, ట్రేడర్స్ బుచ్చన్న, మేస్త్రీలు పాల్గొన్నారు.


మేస్త్రీలకు ప్రమాద బీమా అందజేస్తున్న భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజనీర్ శ్రీధర్

రాజ్యాంగాన్ని కాపాడడం అందరి బాధ్యత

వీపనగండ్ల: పేదల బాగు కోసం రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే అంబేడ్కర్ సందేశ్ బైక్ యాత్రను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. మహనీయులు కలలు గన్న సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని కులవ్యవస్థ నిర్మూలన, ఆర్థిక సమానత్వం అమలైనప్పుడే మహనీయుల ఆశయాలు సిద్ధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వాతంత్య్రం సిద్ధించి 75ఏళ్లు గడిచినా నేటికీ కుల వివక్ష కొనసాగడం అన్యాయం అని ఆయన అన్నారు. కులమత బేధాలను మరిచి అంబేడ్కర్, జగ్జీవన్‌రాం, పూలే, కలలుగన్న సమాజం కోసం అందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మురళీధర్, మండలాధ్యక్షుడు మీసాల శరత్, నాయకులు రాముడు, నాగేశ్, రఘు, వెంకటేశ్, రామకృష్ణ, చంద్రయ్య, రంజిత్‌కుమార్, రవి పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో బైక్ యాత్ర

అమరచింత: బాబు జగ్జీవన్‌రాం 116 జయంతిని పురస్కరించుకొని కేవీపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి బైక్ యాత్ర ప్రారంభించారు. ఈమేరకు ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఈ శ్యాంసుందర్ మాట్లాడుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో సైకిల్ యాత్ర నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. బాబు జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా మండలంలోని ధర్మపురం, ఆర్‌ఆర్ సెంటర్, కిష్టంపల్లి, నందిమళ్ల, సింగంపేట మండలాల్లో బైక్ యాత్ర నిర్వహించి మహానుభావుల జయంతులను జయప్రదం చేయాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకుడు భక్తరాజు, అరుణ్, శాంతన్న, ప్రత్యూష్, వినోద్, ఎస్.రాజు, దిలీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


వీపనగండ్లలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు

కార్పొరేషన్ రుణాలు ఏమయ్యాయి?

వనపర్తిటౌన్: ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్‌తో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆదుకున్నారని, ఆయన చలవతోనే నిరుపేద ముస్లింలు విద్య, ఉద్యోగ అవకాశాలను అలవోకగా అందుకున్నారని కాంగ్రెస్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సమద్ మియ్యా అన్నారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచి చేసిన పాలకులను ముస్లింలు ఎన్నటికీ మరిచిపోరని చెప్పారు. వైఎస్సార్ హయాంలో తప్పితే కేసీఆర్ పాలనలో ముస్లింలకు ఆశించిన స్థాయిలో రిజర్వేషన్ ఫలాలు దక్కలేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముస్లింల అభ్యున్నతికి పెద్దపీట వేసేందుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టి సారిస్తున్నాడని పేర్కొన్నారు. మైనార్టీ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్నా ఏళ్ల తరబడి రుణాలు అందడం లేదని, వాటి పురోగతి ఏమిటో, ఎప్పుడు నిధులు మంజూరు అవుతాయో తెలియని అయోమయ స్థితిలో దరఖాస్తుదారులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సమద్ మియ్యా

ప్రధాన రహదారిపై కూరుకుపోయిన లారీ

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని రామా థియేటర్ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి సమీపంలో బుధవారం రాయిచూర్ నుంచి లోడ్‌తో వస్తున్న లారీ ప్రధాన రహదారిపై కూరుకుపోయింది. మట్టిమెత్తగా ఉండటంతో లోడ్‌గా ఉన్న లారీ దిగబడటంతో రోడ్డు కింద ఉన్న తాగునీటి పైప్‌లైన్ పైపులు పగిలిపోయాయి. దీంతో నీరు వృథా కావడంతో పాటు ఉదయం 6:40 గంటల నుంచి రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, కమిషనర్ విక్రమసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ బండారు కృష్ణ ఇటాచీతో లారీ కూరుకుపోయిన ప్రాంతంలో మట్టిని తవ్వి, క్రేన్ సాయంతో లారీని బయటకు లాగారు. అనంతరం మున్సిపల్ అధికారులు పైప్‌లైన్‌కు మరమ్మతు చేశారు. ఈ క్రమంలో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో జనం రద్దీగా ఉండే ప్రాంతాలైన శంకర్‌గంజ్, కమాన్ చౌరస్తా, నవతా ట్రాన్స్‌పోర్టు రూట్ మీదుగా మధ్యాహ్నం ఒంటి గంట వరకు బస్సులతో పాటుగా అన్ని రకాల వాహనాలు ఈ ప్రాంతాల్లో రాకపోకలు కొనసాగించి, ట్రాఫిక్‌కు నియంత్రించారు.


రామాథియేటర్ సమీపంలో రోడ్డు మధ్యలో కూరుకుపోయిన లారీ

బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి


బీసీల ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో ఈనెల 9న నిర్వహించనున్న బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీసీలపై దాడులు ఎక్కువయ్యాయని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టించి వేధించడం పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ జెండాలు మోసే కార్యకర్తలుగా, జిందాబాద్ కొట్టే కూలీలుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రశాంతంగా ఉన్న వనపర్తిని విద్వేషాలపర్తిగా మార్చారని, బీసీల ఆత్మగౌరవ సభ ద్వారా నియంత ఆగడాలకు చమరగీతం పాడదామని పిలుపునిచ్చారు. సభకు మాజీ మంత్రి ఈటెల రాజేందర్‌తోపాటు, జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరవుతారని తెలిపారు.

కబ్జా కోరల్లో ప్రభుత్వ భూములు

వనపర్తి క్రైం: చెరువు గట్లు, ప్రభుత్వ భూములు, గ్రామ కంఠాలను అమ్ముకుంటున్న నాయకులపై కేసు నమోదు చేయట్లేదని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన సదరు వ్యక్తిపై వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం మాట్లాడుతూ వనపర్తిలో ప్రశ్నించిన బీసీలపై అక్రమ కేసులు పెడుతున్నారని, న్యాయ, ప్రజా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రాజపేటతండా వద్ద 13ఏళ్ల క్రితం ప్లాట్లు వేసి అమ్మారని, కానీ బందరు భూమిని చదును చేయడంపై ప్రశ్నించినందుకు అక్రమ కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఒక సివిల్ కేసులో హుటాహుటిన రూరల్ పోలీసులు భూమిపైకి వెళ్లి విచారణ చేయడం చట్టంలో ఉందా అని ప్రశ్నించారు. అక్రమంగా భూమిని చదును చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మద్దిగట్లలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయానికి వచ్చిన మంత్రికి స్థానిక నేతలు ఘనస్వాగతం పలికారు. కల్యాణోత్సవం అనంతరం గ్రామ పెద్దలు మంత్రిని శాలువాలతో సత్కరించారు. మంత్రి వెంట జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.